AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
9-12-2025 (Tuesday) MAIN EDITION

## తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ : సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** దశాబ్దాల పాటు చేసిన పోరాటాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ మేరకు అన్ని కలెక్టరేట్ లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఫ్యూచర్ సిటీలోని గ్లోబల్ సమిట్ ప్రాంగణం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా విగ్రహాలను ప్రారంభించారు. కాగా.. ప్రభుత్వం 5.8 కోట్ల వ్యయంతో 33 జిల్లాల కలెక్టరేట్ లలో విగ్రహాలను ఏర్పాటు చేసింది.

## ఏపీలో ఘోర ప్రమాదం.. ఒకరి సజీవ దహనం



**అక్షరటుడే, ఏపీ:** ఏపీలోని ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బెస్తవారిపేట మండలం పెంచికలపాడు సమీపంలో రెండు లారీలు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. అనంతపురం నుంచి టమాటా లోడ్‌తో రాజమండ్రి దిశగా వస్తున్న లారీ పెంచికలపాడు వద్దకు రాగానే టైరు పేలి ఆయిల్ ట్యాంకర్‌పై దూసుకెళ్లింది. దీంతో ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతిని డ్రైవర్ పైడికొండల దుర్గారావు (40) క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. మంటలు చెలరేగడంతో సజీవదహనమయ్యాడు.

## సోనియా గాంధీకి కోర్టు నోటీసులు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారన్న ఆరోపణల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూలోని సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం సెషన్స్ కోర్టు సోనియాకు నోటీసులు జారీ చేసింది.

## అనంత్ అంబానీకి అరుదైన గౌరవం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వంతారా పేరిట వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న అనంత్ అంబానీకి అరుదైన గౌరవం లభించింది. అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ సొసైటీ ఆయనకు గ్లోబల్ హ్యుమానిటేరియన్ అవార్డును ప్రదానం చేసింది. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును అందజేసింది.

## అమెరికాలో మంత్రి లోకేష్ బిజీబిజీ




**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, డీప్ టెక్, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ఐటీ, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది. సోమవారం రాత్రి శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆయన ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు, టెక్ దిగ్గజాలతో వరుసగా భేటీలు నిర్వహించారు.



## భారత బియ్యంపై సుంకాలు..!

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** భారత ఉత్పత్తులపై ఇప్పటికే భారీగా సుంకాలు విధిస్తున్న ట్రంప్ మరో బాంబు పేల్చేందుకు సిద్ధం అయ్యాడు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నామనే కారణంతో అమెరికా భారత్‌పై 50 శాతం టారిఫ్స్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఫార్మా ఉత్పత్తులపై వంద శాతం సుంకాలు వేస్తున్నాడు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు మరో బాంబు పేల్చడానికి సిద్ధం అయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం బియ్యాన్ని అమెరికన్ మార్కెట్లోకి "డంప్" చేస్తోందని విమర్శించారు. ఈ సమస్యను తాను "జాగ్రత్తగా చూసుకుంటానని" మరియు సుంకాలు "సమస్యను" సులభంగా పరిష్కరించగలవని చెప్పారు.

## మార్కెట్‌లో కొనసాగిన నష్టాలు..

**అక్షరటుడే, ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా ఫెడ్ ప్రకటన వేళ లాభాల స్వీకరణ కొనసాగింది. దీనికితోడు భారత్ నుంచి దిగుమతి అయ్యే బియ్యంపై టారిఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం వేళ ఈ ప్రకటన వెలువడడంతో అనిశ్చితి నెలకొంది. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయి తర్వాత కాస్త కోలుకుంది. ఆఖరికి 436.41 పాయింట్ల నష్టంతో 84,666.28 వద్ద ముగిసింది.



# పెట్టుబడుల వెల్లువ

**రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు ఆహ్వానించాలనే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. వివిధ దేశాల ప్రతినిధులతో, కంపెనీలు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. రెండో రోజు సదస్సుల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 27 అంశాలపై చర్చలు జరి గాయి. అనేక కంపెనీలు తెలంగాణతో పాటు ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి ఎంవో యూ కుదుర్చుకున్నాయి. పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకున్నాయి. గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ తెలంగాణలో రూ. 150 కోట్ల పెట్టుబడితో పాల వ్యాపారాన్ని విస్తరించే ప్రతిపాదనపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ చేయడానికి కంపెనీల ఆసక్తి
- గ్లోబల్ సమ్మిట్‌లో ప్రభుత్వం ఒప్పందాలు
- ఉపాధి కల్పనే లక్ష్యంగా చర్యలు

### ఆహార పరిశ్రమలు

ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అత్యాధునిక ఆహారం, వ్యవసాయ పరిశోధన అభివృద్ధి కేంద్రం, గ్రీన్‌ఫీల్డ్ అరుదైన చక్కెరల తయారీ సౌకర్యం అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనపై అవగాహన ఒప్పందం చేసుకుంది. మొత్తం రూ. 2,000 కోట్లు (ఫేజ్ 1లో రూ. 500 కోట్లు, ఫేజ్ 2లో రూ. 1,500 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ సంస్థకు వంద ఎకరాల భూమి కావాల్సి ఉండగా.. రెండేళ్లలో 800కు పైగా ఉద్యోగులను తీసుకుంటుంది. తెలంగాణలో స్థిరమైన వ్యవసాయం కోసం స్పెషాలిటీ క్రాప్ న్యూట్రిషన్, బయోస్టిమ్యులెంట్లు, బయోలాజికల్స్ కోసం రూ. 200 కోట్లతో ఒక ప్రాజెక్టును కూడా ప్రతిపాదిస్తోంది. పెద్ద ఎత్తున ఆహారం, పానీయాల తయారీ (యూనిట్ 2) ద్వారా 44 ఎకరాల భూమిలో రూ. 650 కోట్ల పెట్టుబడితో తెలంగాణ కార్యకలాపాలను విస్తరించేందుకు కేజేఎస్ ఇండియా ఒప్పందం చేసుకుంది. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ పానీయాలు, స్నాక్స్, మిఠాయి వినియోగదారు ఉత్పత్తుల కోసం 1,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీని ద్వారా వెయ్యి మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది.


### రూ.70 వేల కోట్లు..

ఇన్‌ఫ్రాకీ డీసీ పార్కులు పెద్ద ఎత్తున డేటా పార్క్ అభివృద్ధి చేయనుంది. 150 ఎకరాల డేటా సెంటర్, మౌలిక సదుపాయాల కోసం రూ.70 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. పర్ప్యూ గ్రూప్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ఆల్‌డ్రైవెన్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించడానికి ముందుకు వచ్చింది. హెటెరో గ్రూప్ రూ.1800 కోట్లు ఇన్వెస్ట్ చేయడానికి ముందుకు వచ్చింది. అయితే వంద ఎకరాల భూమి అవసరం అని ప్రతిపాదించింది.

### ఎనర్జీ రంగంలో..

రాష్ట్ర ప్రభుత్వం క్లీన్, గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పలు కంపెనీలు పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. జేసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఆర్సీటీ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 3 దశల్లో 2,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అక్విలాన్ నెక్సస్ లిమిటెడ్ క్లీన్ ఎనర్జీ ఆధారిత 50ఎండబ్ల్యూ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఏజీపీ గ్రూప్ 125 ఎకరాల్లో ఒక గిగా వాట్ హైపర్‌స్కేల్ డీసీ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుంది. దీనికి మద్దతుగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను రూ.6,750 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది.

## రేవంత్‌రెడ్డి అంటే వెన్నుపోటు...: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** రేవంత్‌రెడ్డి అంటే ద్రోహి, వెన్నుపోటు అని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వెలువడడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం హరీశ్‌రావు మాట్లాడారు. నవంబర్ 29న కేసీఆర్ దీక్ష చేపట్టడంతో దిగొచ్చిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9 ప్రకటన చేసిందన్నారు. అనంతరం సమాఖ్య పాలకులకు తలొగ్గి డిసెంబర్ 23 ప్రకటన చేశారని గుర్తు చేశారు. నాడు సోనియా గాంధీ బలి దేవత అన్న రేవంత్‌రెడ్డి నేడు దేవత అంటున్నారని విమర్శించారు. డిసెంబర్ 9 ప్రకటన చేసినందుకు సోనియా గాంధీని పొగుడుతున్న రేవంత్ 23 ప్రకటన సందర్భంగా తెలంగాణ విద్రోహ దినంగా జరపాలన్నారు. ఇచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకున్నారనే చర్చను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

## కవితపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె అవినీతి చిట్టా తన వద్ద ఉందన్నారు. కవితకు సీఎం రేవంత్‌రెడ్డి కంటే పెద్ద ఇల్లు ఉందని, అది ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కవిత ఇటీవల జాగృతి జనంబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు, గత బీఆర్ఎస్ పాలనపై ఆమె విమర్శలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు టార్గెట్‌గా అనేక ఆరోపణలు చేశారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సైతం వదలడం లేదు. సోమవారం కవిత కూకట్‌పల్లి నియోజకవర్గంలో పర్యటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావుపై ఆమె ఆరోపణలు చేశారు. కవిత వ్యాఖ్యలపై మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే స్పందించారు. కవిత జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు.

## ఇండిగో సంక్షోభంపై ప్రధాని కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, ఢిల్లీ:** ఇండిగో సంక్షోభంతో దేశవ్యాప్తంగా వేలాది విమానాలు రద్దయి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందే. ఇండిగో విమానాల రద్దు ఇంకా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. నిబంధనలు వ్యవస్థల బాగు కోసమేనని, ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదని మోదీ అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్డీఏ మిత్రపక్ష సమావేశంలో మాట్లాడరని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజ్ తెలిపారు. ప్రభుత్వం కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా చూసుకోవాలన్నారు. నియమాలు, నిబంధనలు మంచివి, కానీ అవి వ్యవస్థను మెరుగుపరచడానికే అన్నారు. ప్రజలను వేధించడానికి కాదని స్పష్టం చేశారు. సాధారణ పౌరులను ఇబ్బంది పెట్టే చట్టం, నిబంధన ఉండకూడదని మోదీ చెప్పారు.




## ఇంటర్‌లో నాది టైంపాస్ లవ్

**టాలీవుడ్ నటి రాశీ సింగ్ మాటలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. '3 రోజెస్ సీజన్ 2' ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, తన కాలేజీ రోజుల్లో జరిగిన లవ్ స్టోరీ గురించి ఓపెన్‌గా చెప్పకోవడం నెట్టింట చర్చ మొదలైంది. ఆమె మాట్లాడుతూ 'ఇంటర్ పూర్తి చేసి కాలేజీలో చేరిన సమయంలో తన వయసు కేవలం 17 ఏళ్లు. అదే సమయంలో తనకు బాయ్‌ఫ్రెండ్ ఉండేవాడు. అతడు తాను చదివే కాలేజీలోనే లెక్చరర్' అని తెలిపారు. అయితే మాది సీరియస్ లవ్ కాదు.. ఇప్పుడు అతనికి పెళ్లి అయింది. ఇన్‌స్టాలో కూడా నన్ను ఫాలో అవుతున్నాడు" అని చెప్పిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

## పూరీ జగన్నాథుడి సేవలో గంభీర్, సూర్యకుమార్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టీ20 సిరీస్‌లో భాగంగా భారత్, సౌతాఫ్రికా మధ్య తొలి పోరుకు కటక్‌లోని బారాబతి స్టేడియం వేదికైంది. ఈ నేపథ్యంలోనే ఇరు జట్లు ఆదివారం రాత్రి కటక్ సిటీకి చేరుకున్నాయి. అయితే, ఇవాళ ఉదయం టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దంపతులు, తిలక్ వర్మలు పూరీ జగన్నాథుడి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల దర్శనం చేసుకున్నారు. టీమిండియా ఆటగాళ్ల రాక సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

## నటుడు రాజశేఖర్‌కు శస్త్రచికిత్స



**అక్షరటుడే, సినిమాడెస్క్ :** సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ సినిమాల్లో చురుకుగా నటించడం ప్రారంభించిన ప్రముఖ నటుడు డాక్టర్ రాజశేఖర్ మరోసారి షూటింగ్‌లో గాయపడ్డారు. నవంబర్ 25న మేడ్చల్ పరిసరాల్లో జరుగుతున్న యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణలో ఆయన కాలికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. యాక్షన్ సీన్‌లో భాగంగా జరిగిన ప్రమాదంలో రాజశేఖర్ కుడి చీలమండకు బైమలియోలార్ డిస్‌లోకేషన్‌తో పాటు కాంపౌండ్ ఫ్రాక్చర్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. వైద్యుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు ఆపరేషన్‌కు అంగీకరించారు. డిసెంబర్ 8న మూడు గంటలకు పైగా సాగిన శస్త్రచికిత్స విజయవంతంగా ముగిసింది.

## అఖండ2 సినిమా విడుదలకు లైన్ క్లియర్



**అక్షరటుడే, సినిమా డెస్క్:** బాలయ్య ఫ్యాన్స్ ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్న అఖండ-2 సినిమా విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు రిలీజ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో త్వరలోనే నిర్మాణ సంస్థ రిలీజ్ డేట్ ప్రకటించనుంది. బాలకృష్ణ హీరోగా బోయపాటి దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ 2 ఈ నెల 5న విడుదల కావాల్సి ఉంది. 4న ప్రీమియర్ షోతో పాటు రిలీజైన తర్వాత టికెట్ల ధరల పెంపునకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అనుమతులు కూడా ఇచ్చాయి. సాంకేతిక కారణాలతో ప్రీమియర్స్ వాయిదా వేసినట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. మరికొద్ది గంటల్లో సినిమా విడుదల కావాల్సి ఉండగా.. వాయిదా వేస్తున్నట్లు ఈ నెల 5న ప్రకటించిన విషయం తెలిసిందే.